

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 16-11-2022 సంపుటి : 04 సంచిక : 76 పేజీలు : 4 వెల : రూ 3-00

# తెలంగాణ రాష్ట్ర బీజేపీకి మోదీ టానిక్!

*మునుగోడు ఓటమి నుంచి బయటపడేందుకు తోడ్పాటు*

*ఘాటైన విమర్శలతో టీఆర్ఎస్ నోరు కట్టేశారన్న భావన*

*ఇక టీఆర్ఎస్‌తో సై అంటే సై అంటున్న రాష్ట్ర బీజేపీ*



హైదరాబాద్: ప్రధాని మోదీ పర్యటన రాష్ట్ర బీజేపీలో నూతనోత్తేజాన్ని నింపింది. తెలంగాణ పర్యటనలో రెండుచోట్ల మోదీ చేసిన ప్రసంగాలు.. మునుగోడు ఓటమి నుంచి కార్యకర్తలను బయటపడేశాయని, స్ఫూర్తి రగిలించాయని పార్టీ నేతలు అంటున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దూకుడుగా వెళ్లేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు. హై ఓల్టేజీ ప్రచారంతో జాతీయ దృష్టిని ఆకర్షించిన మునుగోడు ఉప ఎన్నిక ఓటమి.. బీజేపీలో కొంత నైరాశ్యాన్ని మిగిల్చింది. ప్రధాని పర్యటన దాన్ని మాయం చేసిందని పార్టీవర్గాలు విశ్లేషిస్తున్నాయి. పార్టీకి ప్రతి కూలంగా వచ్చిన ఫలితంతో కుంగిపోకుండా ధైర్యంగా నిలబడేందుకు ఈ పర్యటన ఉపయోగపడిందని చెబుతున్నారు. అయితే.. గతంలో రాష్ట్ర పర్యటనకు వచ్చిన బీజేపీ జాతీయ నాయకత్వం విమర్శలపై అధికార టీఆర్ఎస్ తీవ్రస్థాయిలో స్పందించేది. మంత్రులు, ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా దాడి చేసేవారు. ఈసారి మోదీ పర్యటనలో బేగంపేట సభలో టీఆర్ఎస్‌పై నేరుగా రాజకీయ విమర్శలు చేశారు. రామగుండంలో కేంద్రం చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూనే.. సింగరేణిని కేంద్రం ప్రైవేటీకరిస్తోందంటూ రాష్ట్రప్రభుత్వ ప్రచారాన్ని ఖండించారు. పర్యటన ముగిసి రెండు రోజులైనా.. టీఆర్ఎస్ నేతలు, మంత్రులు స్పందించలేదు. ఎదురుదాడి చేయలేదు. దీంతో ప్రధాని పర్యటన సూపర్ సక్సెస్ అయినట్టేనని ఆ పార్టీ నేతలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. మోదీ చేసిన ఘాటైన విమర్శలకు ఏ విధంగా స్పందించాలో కూడా దిక్కుతోచని పరిస్థితుల్లో టీఆర్ఎస్ పడిందని అంటున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ పరోక్షంగా టీఆర్ఎస్‌కు హెచ్చరికలు చేయడం టీఆర్ఎస్‌ను డైలమాలో పడేసిందని భావిస్తున్నారు. ప్రధాని హెచ్చరికలు టీఆర్ఎస్‌ను ఆత్మరక్షణలో పడేస్తాయని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో అవినీతి, కుటుంబ పాలన పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవినీతి రహిత పాలన అందించడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని మోదీ స్పష్టంచేయడం ప్రజల మద్దతు కూడగట్టేందుకు దోహదపడుతుందని విశ్వసిస్తున్నారు.

# రాష్ట్రంలో గతంతో పోలిస్తే మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయి: సీఎం జగన్



అమరావతి: రాష్ట్రంలో అక్రమ మద్యం తయారీ, అమ్మకాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. గంజాయి, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వాణిజ్య పన్ను చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. ఆదాయాలను ఇచ్చే శాఖలపై సీఎం జగన్ ఇవాళ సమీక్షించారు. తొలుత వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమీక్షించిన సీఎం ఆ శాఖ ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పన్ను చెల్లింపుదారులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. చెల్లింపుల ప్రక్రియను మరింత సౌలభ్యంగా చేయాలని సూచించారు. అవగాహన పెంచుతూనే వారి అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. దీనివల్ల చెల్లింపులు సకాలంలో జరుగుతాయని, పన్ను కట్టేవారికి కూడా చక్కటి సేవలు అందించినట్లవుతుందని చెప్పారు. ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు.

మద్యం అమ్మకాలు తగ్గాయి..

ఎక్సైజ్ శాఖపై సమీక్షించిన సీఎం జగన్.. గతంతో పోలిస్తే మద్యం అమ్మకాలు తగ్గాయన్నారు. బెల్టుషాపులు తొలగించడం, పర్మిట్ రూమ్‌లు రద్దు చేయడం వంటి వివిధ రకాల నియంత్రణ చర్యల వల్ల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. రేట్లు పెంచడం వల్ల కూడా మద్యం వినియోగం తగ్గిందన్నారు. మద్య అక్రమ రవాణాను నివారించడానికి తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలో గంజాయి నివారణ చర్యలు చేస్తూనే... అక్కడ కూడా ఉపాధి మార్గాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. వారికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్నాయో లేదో తనిఖీ చేసి, లేకపోతే అర్హులైన వారికి పట్టాలివ్వాలని ఆదేశించారు. పట్టాలు వచ్చిన రైతులకు తద్వారా రైతు భరోసా కూడా లభిస్తుందన్నారు. అప్పుడే ఆశించిన స్థాయిలో మార్పు వస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖపైనా సమీక్షించిన సీఎం.. శాశ్వత భూహక్కు, భూసర్వే కార్యక్రమం చేపడుతున్న గ్రామాలు, వార్డుల్లో సబ్ రిజిస్ట్రార్ భవనం, సేవలు వంటి వాటిపై అవగాహన కలిగించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ దిశగా ఓరియెంటేషన్ అందించాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. మైనింగ్ శాఖపై సమీక్షిస్తూ.. నాన్ ఆపరేషనల్ మైన్స్‌పై మరింత దృష్టి పెట్టాలన్నారు. నిరుపయోగంగా ఉన్న మైనింగ్ ఏరియాలో కార్యకలాపాలు మొదలయ్యేలా చూడాలని అధికారులకు సీఎం జగన్ నిర్దేశించారు.

# రైతుల నుంచి ఎవరైనా డబ్బు డిమాండ్ చేశారో.. మంత్రి పెద్దిరెడ్డి సీరియస్ వార్నింగ్

విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించే విషయంలో రాజీపడేదే లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో డిమాండ్‌కు తగిన విధంగా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశించారని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించేంది లేదని తేల్చిచెప్పారు. వ్యవసాయ కనెక్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులను రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని.. దీనికి సంబంధించి అధికారుల నుంచి వివరణ కోరతామని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కడైనా రైతుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఏపీ సర్కార్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ




అమరావతి: డీఈడీ కాలేజీల గుర్తింపు రద్దుపై హైకోర్టు లో ఏపీ సర్కార్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఏపీలో డీఈడీ కాలేజీల గుర్తింపు రద్దుచేస్తూ ఇచ్చిన జీవోను హైకోర్టు కొట్టేసింది. 318 డీఈడీ కాలేజీల గుర్తింపు రద్దుచేస్తూ ఏపీ సర్కార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కాలేజీల గుర్తింపు రద్దుపై హైకోర్టును యాజమాన్యాలు ఆశ్రయించారు. అయితే ఏపీ ప్రభుత్వ ఉత్తర్వులను కోర్టు కొట్టివేసింది. ఎన్‌సీటీఈ భవిష్యత్‌లో ఫ్రెష్ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కాలేజీల యాజమాన్యాలు సకాలంలో రిప్లై ఇవ్వాలని హైకోర్టు సూచించింది. అలాగే డీఈడీ కాలేజీలన్నీ గుర్తింపు పొందినట్టేనని హైకోర్టు పేర్కొంది.

# ఏపీలో కూడా వందే భారత్ రైలు పరుగులు.. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు అంటే!

**ఏపీలో కూడా పట్టాలెక్కనున్న వందేభారత్ రైలుపై వాల్తేరు డీఆర్ఎం అనూప్ క్లారిటీ త్వరలోనే జోన్ కార్యాలయంకు టెండర్లు**

ఏపీకి రైల్వేశాఖ శుభవార్త చెప్పింది. త్వరలోనే వందేభారత్ రైలు పట్టాలెక్కనుంది. విశాఖ నుంచి రెండు నెలల్లో వందేభారత్ రైలు ప్రారంభం కానున్నట్లు వాల్తేరు డీఆర్ఎం అనూప్ సత్పతి తెలిపారు. ఈ రైలు ఏ మార్గంలో ప్రయాణిస్తుందన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ వందే భారత్ రైలు వేగానికి వీలుగా ప్రస్తుతం ఉన్న ట్రాక్ సామర్థ్యం సరిపోతుందని.. ఒకసారి ప్రయోగాత్మక పరిశీలన చేయాల్సి ఉంటుంది అన్నారు. విశాఖ నుంచి తిరుపతి లేనిపక్షంలో విజయవాడకు ఉండొచ్చని సూచనప్రాయంగా చెప్పారు. విశాఖకేంద్రంగా ప్రకటించిన కొత్త రైల్వే జోన్ దక్షిణ కోస్తా కార్యాలయం పనులకు కూడా త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు అనూప్. డీఆర్ఎం కార్యాలయానికి సమీపంలో వైర్‌లెస్ కాలనీలో 13 ఎకరాల స్థలాన్ని కేంద్రమంత్రి అశ్వినీ కూడా పరిశీలించారన్నారు. అక్కడే కొత్త రైల్వే జోన్ కార్యాలయం వస్తుందని.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అధునాతన సదుపాయాలతో భవనం నిర్మిస్తామన్నారు. ఇప్పటికే రూ.106 కోట్లు మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. భవనం డిజైన్లు రైల్వే బోర్డుకు సమర్పించామని.. ఖరారైన వెంటనే టెండర్లు పిలుస్తామన్నారు. విశాఖ రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులకు టెండర్లు ఖరారు చేశామని.. ఈ పనులను మూడేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశాఖలోని ముడసర్లోవ దగ్గర తమకురావాల్సిన స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ అది రైల్వేకు వచ్చేసరికి ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి అన్నారు. ఆ స్థలాన్ని ఇతరత్రా రైల్వే అవసరాలకు వినియోగించుకుంటామని తెలిపారు.

# సూపర్ స్టార్ కృష్ణ కన్నుమూత



హైదరాబాద్,నవంబర్ 15,తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మరో విషాదం నెలకొంది. సూపర్ స్టార్ కృష్ణ (81) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రయోగాల హీరోగా, సాహసాల నటుడిగా పేరుగాంచిన ఘట్టమనేని శివరామ కృష్ణ మరణంతో కుటుంబ సభ్యులతో సహా సినీ పరిశ్రమ శోక సంద్రంలో మునిగిపోయింది. కృష్ణ.. మంచి నటుడు, నిర్మాత, దర్శకులు మాత్రమే కాదు నిర్మాతల పాలిట కల్పవృక్షం.. మంచి మనసున్న వ్యక్తి.. సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్ పై పట్టు ఉన్న కృష్ణ తెలుగు చిత్ర పరిశ్రమలో చేయని ప్రయోగం లేదు. సూపర్ స్టార్ కృష్ణ కన్నుమూశారు. శ్వాస సంబంధిత సమస్యలతో గత కొంత కాలంగా బాధపడుతున్న కృష్ణ ఆరోగ్యం విషమించడంతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆర్ధరాత్రి దాటిన కృష్ణ ఆరోగ్యం విషమించడంతో హుటాహుటిన ఆయన కుమారుడు మహేశ్?బాబు కృష్ణను గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆయన్ను ఎమర్జెన్సీ వార్డుకు తరలించి సీపీఆర్? నిర్వహించారు. అనంతరం కృష్ణను ఐసీయూకి తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. ఆ తర్వాత వైద్యులు ప్రెస్?మీట్? పెట్టి.. కృష్ణ హెల్త్? బులిటెన్? విడుదల చేశారు. మరో రెండు రోజులు గడిస్తేనే కానీ ఏమీ చెప్పలేమని స్పష్టత ఇచ్చారు. అయితే మంగళవారం తెల్లవారుజామున ఆయన కన్నుమూశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటూ సినీ ప్రముఖులు నివాళులు అర్పిస్తున్నారు. 1943, మే 31న గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో ఘట్టమనేని శివరామకృష్ణ (కృష్ణ) జన్మించారు. 1960లో ఏలూరు సి.ఆర్.రెడ్డి. కాలేజీలో బిఎస్సీ డిగ్రీ పట్టాను అందుకున్నారు. వెండి తెరపై నటుడిగా 'కొడుకులు కోడళ్ళు' చిత్రంతో అవకాశం వచ్చినా ఆ సినిమా ఆగిపోయింది. 'తేనె మనసులు' కోసం నూతన నటీనటులు కావాలనే పేపర్ యాడ్ చూసి ఆడిషన్‌కి వెళ్ళి ఎంపికయ్యారు శివరామ కృష్ణ. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా అప్పట్లో సంచలన విజయాన్ని నమోదు చేసింది. తొలి చిత్రంతోనే నటుడిగా అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆ తరువాత ఆయన చిత్రపరిశ్రమలో రికార్డులు సృష్టించే హీరోగా ఎదిగా?. ఒక్కో ఏడాది దాదాపు పదికిపైగా చిత్రాలు విడుదల అయ్యాయి. రోజుకి మూడు షిఫ్టుల చొప్పున బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటించిన సందర్భాలు ఉన్నాయి. నిర్మాతల హీరోగా పేరొందిన కృష్ణని అభిమానులు 'సూపర్‌స్టార్' అని పిలుచుకుంటారు. 350 పైగా చిత్రాల్లో ఎన్నో సాంఘిక, జానపద, పౌరాణిక,జేమ్స్‌బాండ్, కౌబాయ్ వంటి డిఫరెంట్ చిత్రాల్లో మెప్పించిన సూపర్ స్టార్. ఆయన మృతితో తెలుగుచిత్ర సీమ శోక సంద్రంలో మునిగిపోయింది.

ఒకే ఏడాది 17 సినిమాలు

తెలుగు వెండి తెరకు సరికొత్త ఒరవడులుదిద్దుతూ.. ఆయన పరిచయం చేయని జోనర్ లేదు అంటే అతిశయోక్తి కాదు. సుమారు 50 ఏళ్ల క్రితమే పాన్ ఇండియా సినిమాను తెరకెక్కించారు. అప్పట్లో బాలీవుడ్ లో సత్తా చాటుతూ ఆ సినిమా కాసుల వర్షం కురిపించింది. జేమ్స్ బాండ్, కౌబాయ్, 70 ఎమ్ ఎమ్, ఈస్టమన్ కలర్ నుంచి రంగుల సినిమా ఇలా అనేక రకాల జోనర్లను, కొత్త సాంకేతికతను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది సూపర్ స్టార్ కృష్ణగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారు. సొంతం బ్యానర్ పద్మాలయ స్టూడియోస్ బ్యానర్ ను స్థాపించి.. అనేక సినిమాలను తెరకెక్కించారు. భారతదేశంలోనే తొలి యాక్షన్ కౌబాయ్ చిత్రం మోసగాళ్లకు మోసగాడు ఇప్పటికీ వెండి తెరపై చెరగని ముద్రేహాలీవుడ్ సినిమా స్టైల్ లో కౌబాయ్ సినిమాల జానర్ తో కె.ఎస్.ఆర్.దాస్ దర్శకత్వంలో మోసగాళ్ళకు మోసగాడు సినిమా పద్మాలయ స్టూడియోస్ బ్యానర్లోనే తెరకెక్కించారు. ఈ సినిమా తెలుగులోనే కాదు.. భారతదేశంలోనే తొలి యాక్షన్ కౌబాయ్ చిత్రంగా పేరు తెచ్చుకుంది. ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, తమిళం, మలయాళం, హిందీ, బెంగాలీ వంటి భాషల్లో 1971లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల అయ్యింది. రిలీజైన ప్రతి భాషలోనూ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. సింహాసనం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మొదటిసారిగా 70 ఎమ్ ఎమ్ ని పరిచయం చేశారు. తెలుగులో తొలి జేమ్స్‌బాండ్ సినిమా (గూఢచారి 116), తొలి కౌబాయ్ సినిమా (మోసగాళ్ళకు మోసగాడు), తొలి ఫుల్‌స్కోప్ సినిమా (అల్లూరి సీతారామరాజు), తొలి 70 ఎంఎం సినిమా (సింహాసనం) వంటివి సూపర్ స్టార్ కృష్ణ సినిమాలే.. అంతేకాదు కృష్ణ ఒకానొక సమయంలో రోజుకి మూడు షిఫ్ట్ ల చొప్పున పని చేస్తూ.. ఏడాదికి 10 సినిమాలను పూర్తి చేశారు. అంటే 1964 నుంచి 1995 వరకు కృష్ణ సగటున పదేళ్ళకు వంద సినిమాల్లో నటించారు. అంటే ఏడాదికి 10 సినిమాల చొప్పున 300 సినిమాలు పూర్తి చేశారు.

# నూతన ఒరవడులు ప్రవేశపెట్టిన ఘనత కృష్ణదే: కేసీఆర్, జగన్ సహా ప్రముఖుల సంతాపం

హైదరాబాద్: సూపర్‌స్టార్ కృష్ణ మృతి పట్ల రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, తెదేపా అధినేత చంద్రబాబు, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహా పలువురు ప్రముఖులు కృష్ణ మృతికి సంతాపం తెలిపారు.



"విభిన్న కుటుంబ కథా చిత్రాలతో పాటు ప్రజలకు సామాజిక స్పృహ కలిగించే సాంఘిక చిత్రాల నటుడిగా కృష్ణ జనాదరణ పొందారు. నాటి కార్మిక, కర్షక లోకం ఆయన్ను తమ అభిమాన హీరోగా, సూపర్‌స్టార్‌గా కీర్తించేవారు. సొంత నిర్మాణ సంస్థ స్థాపించి సినిమా రంగంలో నూతన ఒరవడులను ప్రవేశపెట్టిన ఘనత కృష్ణదే. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా"– కేసీఆర్

"నిజ జీవితంలోనూ కృష్ణ మనసున్న మనిషి. ఆయన మరణం తెలుగు సినీ రంగానికి, తెలుగువారికి తీరని లోటు. ఆంధ్రా జేమ్స్ బాండ్‌గా ఆయన కీర్తి గడించారు. ఈ కష్ట సమయంలో కృష్ణ కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇవ్వాలని దేవుడిని కోరుకుంటున్నా"

– జగన్

"తెలుగు సినీ పరిశ్రమలో మంచి మనిషిగా, నిర్మాతల హీరోగా, నటశేఖరుడిగా, సూపర్‌స్టార్‌గా పిలిపించుకున్న నటులు, మాజీ ఎంపీ కృష్ణ గారి మరణంగ్భ్రాంతికి గురిచేసింది. నటుడిగా, దర్శకుడిగా, తెలుగు సినిమాకు తొలి సాంకేతికతను అద్దిన సాహస నిర్మాతగా కృష్ణగారిని చెబుతారు. ఆయన మరణంతో ఒక అద్భుత సినీశకం ముగిసినట్లయింది. ఇటీవలే తల్లిని, ఇప్పుడు తండ్రిని కూడా కోల్పోయిన మహేష్ బాబుకు ఇది తీరని వేదన. ఈ బాధ నుంచి త్వరగా కోలుకునే మనోధైర్యాన్ని ఆయనకు ఇవ్వాలని భగవంతుని కోరుకుంటూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను"

– చంద్రబాబు

# సంపాదకీయం

బుధవారం 16-11-2022

## సీపీఎస్ వర్సెస్ ఓటీఎస్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్యత్తు గురించి ఆలోచించి సీపీఎస్‌ను రద్దు చేసి ఓటీఎస్ ను పునరుద్ధరించాలి. దీనితో ప్రభుత్వ ఖజానాకు కూడా వేల కోట్లు జమవుతాయి. నెలనెలా రూ. 200 కోట్లు చెల్లించనవసరం లేదు. జీపీఎస్ రూపంలో వందల కోట్లు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ తీర్చినట్టూ ఉంటుంది. అన్ని సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ఆయుధంగా ఉపయోగించుకోవాలి. రాష్ట్ర ఉద్యమంలో ఎలాగైతే జేఏసీ ఏర్పాటు చేసారో, అలాగే సమైక్యంగా మరో పోరుకు సిద్ధం కావాలి. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులు సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్‌కు అనుగుణంగా కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సీపీఎస్ రద్దు చేయగా, కొన్ని రాష్ట్రాలు రద్దు చేసే ఆలోచనలో ఉన్నామని ప్రకటించాయి. సీపీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం 2004లో ప్రారంభించింది. వెనువెంటనే రాష్ట్ర ప్రభుత్వాలు వర్తింపజేసుకున్నాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణ కూడా కేంద్రం కోరిన వెంటనే ఇందులో చేరిపోయింది. ప్రారంభంలో పెద్దగా ఈ పెన్షన్ స్కీం గురించి ఉద్యోగులు పట్టించుకోలేదు. కాలం గడుస్తున్న కొద్ది సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య పెరగడంతో దీని వలన వచ్చే నష్టాలను గుర్తించారు. ఉద్యోగ విరమణ పొందాక వస్తున్న పెన్షన్ ఆసరా పెన్షన్ కంటే దారుణంగా ఉండటంతో దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరిగింది. సీపీఎస్ రద్దుకు డిమాండ్ పెరిగింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాల ఒత్తిడి మేరకు ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఝార్ఖండ్, పంజాబ్ వంటి రాష్ట్రాలు సీపీఎస్ రద్దు దిశగా అడుగులు వేశాయి. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఈ నూతన ఆర్థిక సంవత్సరం నుంచి ఓపీఎస్‌ను అమలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 240 మందికి ఓపీఎస్ సౌకర్యం కల్పించారు. ఛత్తీస్‌గఢ్ సీపీఎస్‌ను రద్దు చేస్తూ గెజిట్ విడుదల చేసి జీపీఎఫ్ సౌకర్యం కల్పించింది. ఝార్ఖండ్‌లో సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను సెప్టెంబర్ ఒకటి నుంచి అమలులోకి తెచ్చారు. పంజాబ్ ముఖ్యమంత్రి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. తమిళనాడులోనూ రద్దు చేయనున్నారు. మన పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సైతం ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎన్నికలు జరగబోతున్న గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇదే ప్రధాన అంశంగా ఉంది. సీపీఎస్ మనకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అమలులోకి వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తప్పుకునే అవకాశం ఉన్నా కూడా తెలంగాణ సీపీఎస్ విధానానికి అంగీకరించింది. ఇదే ఇప్పుడు తెలంగాణ ఉద్యోగులకు శాపమైంది. నిజానికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల పాత్ర అనిర్వచనీయం. 45 రోజుల పాటు ఉద్యోగాలను ఫణంగా పెట్టి సకల జనుల సమ్మె చేసి ఉద్యమాన్ని గల్లీ నుండి ఢిల్లీ దాకా తీసుకెళ్లడంలో ప్రముఖ పాత్ర పోషించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగానే అన్ని ఉద్యోగ సంఘాలు న్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో శక్తికి మించి పని చేస్తూ అన్ని రంగాలలో రాష్ట్రాన్ని ముందువరుసలో నిలుపుతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల భవిష్యత్తు గురించి ఆలోచించి సీపీఎస్‌ను రద్దు చేసి ఓటీఎస్ ను పునరుద్ధరించాలి. దీనితో ప్రభుత్వ ఖజానాకు కూడా వేల కోట్లు జమవుతాయి. నెలనెలా రూ. 200 కోట్లు చెల్లించనవసరం లేదు. జీపీఎస్ రూపంలో వందల కోట్లు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ తీర్చినట్టూ ఉంటుంది. అన్ని సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రానున్నఎమ్మెల్సీఎన్నికలనుఆయుధంగాఉపయోగించుకోవాలి. రాష్ట్ర ఉద్యమంలో ఎలాగైతే జేఏసీ ఏర్పాటు చేసారో, అలాగే సమైక్యంగా మరో పోరుకు సిద్ధం కావాలి.

# మోడీ రూట్ మ్యాప్ ఇచ్చేశారా

విశాఖపట్టణం, నవంబర్ 15, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎప్పటి నుంచో రోడ్ మ్యాప్ అడుగుతున్నా మిత్ర పార్టీ బీజేపీ పెద్దల నుంచి పెద్దగా స్పందన కనిపించేది కాదు. ఇదే విషయాన్ని ఇటీవల జనసేన పార్టీ నేతలు, శ్రేణులతో మంగళగిరిలో నిర్వహించిన సమావేశంలో కూడా పవన్ కళ్యాణ్ కాస్త గట్టిగానే ప్రస్తావించారు. అయితే.. ఇటీవల ప్రధాని మోడీ విశాఖలో పర్యటించిన సందర్భంగా పవన్ కళ్యాణ్ కు పీఎంఓ నుంచి ప్రత్యేకంగా ఆహ్వానం అందింది. అలాగే.. బీజేపీ కోర్ కమిటీ కంటే ముందుగానే పవన్ కళ్యాణ్ కు కేవలం పది నిమిషాల సమయం ఇచ్చినప్పటికీ.. అరగంటకు పైగా ఆయనతో మోడీ చర్చలు జరపడం విశేషం. ఈ సందర్భంగానే పవన్ కళ్యాణ్ కు ప్రధాని మోడీ రోడ్ మ్యాప్ ఇచ్చారనే ఊహాగానాలు వస్తున్నాయి. ఏపీలో వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా చేసేందుకు టీడీపీ-జనసేన-బీజేపీలతో కలిపి ఉమ్మడి విపక్షం ఏర్పాటు కోసం పవన్ కళ్యాణ్ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే.. ఉమ్మడి విపక్షానికి బదులు జనసేన-బీజేపీతో కూడిన పరిమిత విపక్షాన్ని బలోపేతం చేయాలని, తద్వారా వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని మోడీ రోడ్ మ్యాప్ ఇచ్చారని అంటున్నారు. అందుకేనేమో మోడీతో భేటీ తర్వాత పవన్ కళ్యాణ్ ఉమ్మడి విపక్షం విషయంలో మౌనం వహిస్తున్నట్లు కనిపిస్తోందని ఏపీలో తాజాగా రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. మోడీ జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ తో అరగంటకు పైగా చేసిన చర్చలే ప్రధాని విశాఖపట్నం పర్యటనలో కీలకంగా మారాయంటున్నారు. విశాఖలో తన తొలి రోజు పర్యటనలో పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. తర్వాతి రోజు మోడీ టూర్ లో గవర్నర్, సీఎం జగన్ కనిపించారు. విశాఖలో తొలిరోజు పర్యటనను మోడీ రాజకీయ చర్చలతో ప్రారంభించారు. తద్వారా తన ప్రాధాన్యతలు ఏమిటో మోడీ చెప్పకనే చెప్పారంటున్నారు. రెండో రోజు అభివృద్ధి కార్యక్రమాల్లో మోడీ గడిపారు. అంటే.. ఏపీలో మోడీ పర్యటనలో రాజకీయ పార్టీలకు ఇచ్చిన ప్రాధాన్యం ఏమిటన్నది స్పష్టం చేశారంటున్నారు. వైజాగ్ లో తన పర్యటనను పోలీసుల ద్వారా అడ్డుకున్న వైసీపీ సర్కార్ తీరుతో పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రవేశాలకు గురయ్యారు. విశాఖ నుంచి మంగళగిరి వచ్చిన పవన్ కళ్యాణ్ వైసీపీ నేతలు, మంత్రులకు చెప్పు చూపించి మరీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ మంగళగిరిలో ఆవేశపూరితంగా చేసిన ప్రసంగం ఏపీలో తీవ్ర సంచలనంగా మారింది. పవన్ కళ్యాణ్ సభ తరువాత విజయవాడలో బస చేసిన హ్పాటల్ కు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వెళ్లి పవన్ కళ్యాణ్ కు మద్దతుగా నిలిచారువైసీపీకి వ్యతిరేకంగా టీడీపీ-జనసేన-బీజేపీలతో బలమైన ఉమ్మడి ప్రతిపక్షం ప్రతిపాదన చేస్తున్న పవన్ కళ్యాణ్ ఉత్సాహానికి ప్రధాని మోడీ తన రూట్ మ్యాప్ ద్వారా బ్రేక్ వేశారని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. నిజానికి టీడీపీ-జనసేన-బీజేపీలతో ఏర్పడిన ఉమ్మడి విపక్షం అయితే.. అధికార వైసీపీని వచ్చే ఎన్నికల్లో మట్టి కరిపించవచ్చనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

ప్రస్తుతానికి టీడీపీతో పొత్తు గురించి ఆలోచించవద్దని, బీజేపీ-జనసేన మాత్రమే కలిసి ముందుకు వెళ్లాలని, వచ్చే ఎన్నికల నాటికి అవసరం, అవకాశాన్ని బట్టి టీడీపీతో పొత్తు విషయం చూద్దామని పవన్ కళ్యాణ్ కు ప్రధాని మోడీ చెప్పినట్లు తెలుస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అందువల్లే పవన్ కళ్యాణ్ నిరుత్సాహం కలిగిందంటున్నారు. మోడీతో భేటీ తర్వాత బయటకు వచ్చిన పవన్ కళ్యాణ్ మాటల్లో ఆ నిరుత్సాహమే కనిపించిందంటున్నారు. అందుకే పవన్ కళ్యాణ్ పొత్తుల విషయమై మీడియా అడిగిన ప్రశ్నలకు జవాబు ఇవ్వకుండానే వెళ్లిపోయారంటున్నారు. అందుకే మోడీతో సమావేశం సందర్భంగా తమ మధ్య ప్రస్తావనకు వచ్చిన అంశాలు చెప్పకుండా పవన్ మౌనం వహించారంటున్నారు. సుమారు ఎనిమిదేళ్ల తర్వాత పవన్ కళ్యాణ్ తో మోడీ ప్రత్యేకంగా భేటీ అవడం పెద్ద ఎత్తున చర్చనీయాంశం అయింది. జనసేనను ఓ రాజకీయ పార్టీగా గుర్తించబోమని చెబుతున్న వైసీపీ సర్కార్ కు పవన్ కు అంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మోడీ గట్టి ఝులక్ ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# నెల్లూరులో వానల బీభత్సం



నెల్లూరు, నవంబర్ 15, భారీ వర్షాలు నెల్లూరు జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. జన జీవనం స్తంభించింది. ప్రాజెక్ట్ లు నిండు కుండల్లా ఉన్నాయి. పెన్నా నదీ ప్రవాహం పెరుగుతోంది. నెల్లూరు నగరంలో భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వరుసగా రెండు రోజులు సెలవలు రావడంతో ప్రజలకు వర్షాలతో పెద్దగా ఇబ్బంది లేకుండా పోయింది. సోమవారం నుంచి ప్రజలు రోజువారీ పనులకు బయటకు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా నెల్లూరు జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు నగరంలో వర్షాలకు ఎక్కడికక్కడ రోడ్లు నీటమునిగాయి. నెల్లూరు నగరం మధ్య నుంచి రైల్వే లైన్ వెళ్తుంది, దీని కారణంగా వాహనాలకు అండర్ బ్రిడ్జ్ లే దిక్కు. వర్షం పడితే అండర్ బ్రిడ్జ్ ల వద్దకు నీరు చేరుతుంది. రెండురోజులుగా భారీ వర్షాలతో అండర్ బ్రిడ్జ్ ల వద్ద వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. అయినా కూడా బస్సులు, ఆటోల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రజలు ప్రయాణాలు చేస్తున్నారు. రైల్వే ట్రాక్ ని దాటేందుకు సాహసం చేస్తున్నారు. నెల్లూరు అండర్ బ్రిడ్జ్ ల వద్ద ఉన్న దుస్థితిని అటు అధికారులు పట్టించుకోవట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాలకు ప్రతిసారి ఈ సమస్య ఎదురవుతున్నా దీనికి శాశ్వత పరిష్కారం కోసం నాయకులు చొరవ తీసుకోలేదు. దీంతో ప్రయాణికులు ఇలా సాహసం చేయాల్సి వస్తోంది. నగరానికి చివర్లో ఒకే ఒక ఫ్లైఓవర్ ఉంది. నగరం మధ్యలో ఉన్న అండర్ బ్రిడ్జ్ లతోనే ఈ అవస్థలన్నీ. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనానికి రుతుపవనాలు తోడవడంతో జిల్లాలోని అన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రోజంతా చినుకులు పడుతూ..భారీ వర్షం కురిసింది. దాంతో నెల్లూరు నగరంలోని పలు కాలనీలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. రోడ్లపై నీరు నిలవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. మురుగు కాలువల్లో నీటిపారుదల సక్రమంగా లేకపోవడంతో మురుగంతా రోడ్లపైకి మళ్లింది. అత్యవసర పనులకు బయటకు వచ్చిన జనం.. దుర్వాసన వస్తున్న నీటిలోనే తడుస్తూ రాకపోకలు సాగించారు. భారీ వర్షానికి తోడు.. రోడ్లపైకి నీరు చేరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఆత్మకూరు బస్టాండ్, ముత్తుకూరు రోడ్, మాగుంట లేఅవుట్ రైల్వే అండర్ బ్రిడ్జ్ ల కింద వరదనీరు నిల్వ చేరడంతో మినీబైపాస్ నుంచి జీటీ రోడ్డులోకి వచ్చేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు. మైపాడు గేటు, కొండాయపాళెం గేట్ల దగ్గర వాహనాలు బారులుదీరాయి. ట్రంకురోడ్డు, కేవీఆర్ పెట్రోల్ బంకు, గాంధీబొమ్మ కూడలి, తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. నెల్లూరు జిల్లాలో కావలిలో 188మిల్లీ మీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. కావలిలో పలు కాలనీలు నీటమునిగాయి. అనపగుంత పొంగడంతో వైకుంఠపురం నీట మునిగింది. ముసునూరు చెరువుకు వరదనీరు వెళ్లే కాలువలు సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకి నీరు చేరింది. 50 ఎకరాల్లో సాగుచేసిన మినుము పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మరో రెండురోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని తేలడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

# ఒంగోలు సీటు కోసం కుస్తీలు

ఒంగోలు, నవంబర్ 15, ఒంగోలు పార్లమెంట్ స్థానం ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదట. 1952లో ద్విసభ్య పార్లమెంట్ నియోజకవర్గంగా ఉన్న ఒంగోలు 1957 ఎన్నికల్లో ఏకసభ్య నియోజకవర్గంగా మారింది. 1952 నుంచి 2019 వరకు 17 సార్లు ఒంగోలు పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 10 సార్లు, ఇండిపెండెంట్లు రెండుసార్లు, సీపీఐ ఒకసారి, టీడీపీ రెండుసార్లు, రెండుసార్లు వైసిపి అభ్యర్థులు గెలుపొందారు. ఒంగోలు పార్లమెంట్ స్థానంలో అప్పట్లో కాంగ్రెస్ హవా అంతా ఇంతా కాదట. ఒంగోలు నియోజకవర్గానికి ఏమాత్రం సంబంధం లేని సినీనటుడు కొంగర జగ్గయ్య 1967లో ఒంగోలు నుంచి పార్లమెంట్‌కు కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందడమే ఇందుకు నిదర్శనంగా చెబుతారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తేచాలు ఆయన ఎంపి అయిపోయినట్టేనట? అలా ఉండేదిట అప్పట్లో కాంగ్రెస్ హవా..మరోవైపు టిడిపి ఆవిర్భావం తరువాత పదిసార్లు ఎన్నికలు జరిగితే టిడిపి కేవలం రెండే రెండుసార్లు మాత్రమే గెలుపొందింది. 1984లో ఆ తర్వాత 1999లో టీడీపీ ఇక్కడ్నించి గెలిచింది. 1999 తరువాత టిడిపి అభ్యర్థులు ఒంగోలు నుంచి పార్లమెంట్‌కు వెళ్ళిందే లేదు. రాష్ట్ర విభజనకు పూర్వం కాంగ్రెస్ , విభజన తరువాత వైసిపికి ఒంగోలు పార్లమెంట్ సీటు కంచుకోటగా మారిందని చెబుతారు. 2014లో వైవి సుబ్బారెడ్డి, 2019లో మాగుంట శ్రీనివాసులురెడ్డి వైసిపి అభ్యర్థులుగా వరుసగా గెలిచారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉండటమే ఇందుకు కారణంగా భావిస్తారట. ఒంగోలు పార్లమెంట్ స్థానం మొదటి నుంచి టిడిపికి కొరకరాని కొయ్యగానే ఉందట. టిడిపి ఆవిర్భావం తరువాత 1984లో, పదిహేనేళ్ళ తరువాత 1999లో మాత్రమే ఆ పార్టీ ఇక్కడ గెలిచింది. ఆ తర్వాత 20 ఏళ్ళుగా టిడిపి ఇక్కడ గెలిచిందే లేదు. ఈ ఇరవై ఏళ్ళ కాలంలో టిడిపి నుంచి ఒకసారి పోటీ చేసిన అభ్యర్థి మరోసారి పోటీచేసేందుకు ముందుకు రావడం లేదట. దీంతో టిడిపికి ప్రతి పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త అభ్యర్థి కోసం వెతుకులాట తప్పనిసరిగా మారిందట. టీడీపీ తరపున 2004 , 2009, 2014, 2019లో కొత్త వ్యక్తులే పోటీ చేస్తూ వచ్చి ఓడిపోయారు. ఇప్పటికీ టీడీపీకి ఒంగోలు పార్లమెంట్ పరిధిలో నాయకుడంటూ ఎవరూ లేరట. నామ్‌కేవాస్తే ఇన్‌చార్జిలుగా కొంతమందిని నియమించినా పూర్తిస్థాయి నాయకుడిగా ఉండేందుకు ఎవరూ ముందుకు రావడం లేదట. ఎందుకంటే ఓడిపోయే స్థానంలో ఎవరు పోటీ చేస్తారు చెప్పండి అంటున్నారట సీనియర్ టిడిపి నేతలు. గెలుపు గుర్రం ఎక్కేందుకు ఎవరైనా ముందుకు వస్తారు కానీ, కుంటిగుర్రం ఎక్కేందుకు ఎవరు వస్తారు అంటున్నారట. ఒంగోలు పార్లమెంట్ పరిధిలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉన్నాయి.. దీంతో ఇక్కడ పోటీ చేసే అభ్యర్థులు ఎక్కువగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వాళ్ళే ముందుకు వస్తారట? అందుకు అనుగుణంగానే కాంగ్రెస్, టిడిపి, వైసిపిలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకే ఎక్కువసార్లు టికెట్లు ఇచ్చారట? అందుకే ఇక్కడ 17 సార్లు పార్లమెంట్ ఎన్నికలు జరిగితే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన 12 మంది అభ్యర్థులు గెలిచారని విశ్లేషకులు లెక్కలు చెబుతున్నారు. 1977లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రస్తుత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు భారతీయ లోక్‌దళ్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారట. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి వలస వచ్చిన మాగుంట కుటుంబం ఇక్కడ పాతుకుపోయిందట. 1991 ఆ తర్వాత 1996, 1998, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి 2019 ఎన్నికల్లో వైసిపి నుంచి మాగుంట కుటుంబ సభ్యులు పోటీ చేసి గెలుపొందారు. దీంతో టిడిపికి ఒంగోలు పార్లమెంట్ స్థానం అందని ద్రాక్షలాగా మారిపోయిందట. ఇరవై ఏళ్ళ తరువాతైనా టిడిపి జెండా ఎగురవేస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సిందే. అయితే మూడేళ్లు ఎలాగూ గడచిపోయింది. మిగిలిన కాలమైనా కేడర్ ను ప్రసన్నం చేసుకుంటే అధిష్టానం ఆశీర్వదిస్తుందన్న నమ్మకంతో దూకుడు పెంచిన ఎమ్మెల్యేలు సమయం దొరికితే చాలు గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ప్రతి గ్రామాన్ని చుట్టేస్తున్నారట.

## తల్లీ కూతుళ్ల హత్యాయత్నం కేసులో ట్విస్ట్

కాకినాడ, నవంబర్ 15, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తల్లీకూతురు హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. ముమ్మిడివరం మండలంలోని సీహెచ్ గున్నేపల్లికి చెందిన తనను, తన తల్లి వేండ్రపు వెంకటలక్ష్మిని హత్య చేయించేందుకు సమీప బంధువు వేండ్రపు శ్రీనివాస ప్రసాద్ ప్రయత్నిస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని అన్యం నాగపుష్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై శనివారం రాత్రి ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు ఫిర్యాదులో వివరాల ప్రకారం.. శ్రీనివాస ప్రసాద్ తల్లీకూతురును హత్య చేయించడానికి దార్ల ఏసురాజు అనే వ్యక్తితో రూ. 2 లక్షలు సుపారీ మాట్లాడుకున్నాడు. డబ్బు తీసుకున్న వ్యక్తి భయపడి విషయాన్ని బాధితులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దాంతో పోలీసులు ఏసురాజు, శ్రీనివాసప్రసాద్ లపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. భూ సరిహద్దు తగాదాల కారణంగా వేండ్రపు వెంకటలక్ష్మి కుమారుడు రామకృష్ణకు, శ్రీనివాస్ ప్రసాద్ కు గొడవలయ్యాయి. అప్పుడు రామకృష్ణ కనిపించడం లేదని అతని తల్లి ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా అతని ఆచూకీ కనుగొనలేదని నాగపుష్ప హైకోర్టులో హేబీయస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఉత్తర్వులివ్వడంతో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేయడంతో 2019 డిసెంబరు 8న రామకృష్ణ హత్యకు గురైనట్లు ఆరు నెలల తర్వాత బయట పడింది. ఈ కేసులో ప్రధాన ముద్దాయి శ్రీనివాస ప్రసాద్ కాగా మరో ఇద్దరిపైనా అప్పట్లో కేసు నమోదైంది. గతంలో కొడుకు, ప్రస్తుతం తల్లీకూతురిని హతమార్చేందుకు సుపారీ మాట్లాడినట్లు బాధితులు చెబుతుండడంతో కోనసీమలో చర్చనీయాంశంగా మారింది. మహిళల హత్యకు పథకం పన్నిన నిందితుడిపై కేసు నమోదు అయింది. తన తమ్ముడు రామకృష్ణ హత్య కేసులో ప్రధాన నిందితుడు వేండ్రపు శ్రీనివాస ప్రసాద్ ఇప్పుడు తమను హత్య చేసేందుకు సుపారీ ఇచ్చారని బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. తమ్ముడు హత్యకు గురికావడంతో అనారోగ్యంతో ఉన్న తల్లిని అక్కా ,చెల్లెళ్లు చూసుకుంటున్నారు. చెల్లెలు, పిన్నిని హతమార్చేందుకు శ్రీనివాస ప్రసాద్ రెండు లక్షల రూపాయలు సుపారీ ఇచ్చాడు. సుపారీ తీసుకున్న వ్యక్తి దార్ల ఏసురాజు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఏసురాజు, వేండ్రపు శ్రీనివాస ప్రసాద్ ను అదుపులోకి తీసుకొన్నారు. 2019 డిసెంబరు 8న హనీట్రాప్ ద్వారా హత్యకు గురి అయిన వేండ్రపు రామకృష్ణ హత్యకేసులో శ్రీనివాస ప్రసాద్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. రామకృష్ణ కనిపించకుండా పోయిన ఆరు నెలల వరకూ దర్యాప్తు మందకొడిగా సాగింది. మృతుడు రామకృష్ణ సోదరి హైకోర్టులో హేబీఎస్ కార్పస్ దాఖలు చేయడంతో దర్యాప్తు వేగవంతం చేసి రామకృష్ణ హత్యకు గురి అయినట్లు ప్రధాన నిందితుడు అతని సోదరుడు వేండ్రపు శ్రీనివాస ప్రసాద్ గా గుర్తించారు పోలీసులు. ఇప్పుడు పాత కక్షల కారణంగా శ్రీనివాస ప్రసాద్ తన పిన్ని, చెల్లెలును హత్యచేసేందుకు దార్ల ఏసురాజుతో రెండు లక్షల రూపాయలకు ఒప్పందం చేసుకున్నాడు. భయంతో మృతుడి సోదరికి ఏసురాజు ఫోన్ చేసి చెప్పాడు. స్థానికులు ఏసురాజును పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శ్రీనివాస ప్రసాద్, ఏసు రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ అన్న శ్రీనివాస ప్రసాద్ నుంచి తమకు ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలంటూ పోలీసులను వేడుకుంటున్నారు మహిళలు.

## జనసేనాని నోట జగన్ నినాదం

విజయనగరం, నవంబర్ 15, ఒక్క చాన్స్ ఇవ్వండి...! ఒకే ఒక్క చాన్స్ ఇవ్వండి. " ఇదేదో 2019 ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన నినాదం కాదు. లేటెస్ట్‌గా జనసేనాని పవన్ కళ్యాణ్ నోట నుంచి వచ్చిన సరికొత్త పొలిటికల్ నినాదం. విజయనగరం జిల్లాలోని గుంకలం గ్రామ సరిహద్దులో ఉన్న జగనన్న ఇళ్ళు నిర్మాణ పరిస్థితులను పరిశీలించడానికి వెళ్లిన పవన్...అక్కడి ప్రజలతో మాట్లాడుతూ ఈ కొత్త నినాదం అందుకున్నారు. "ఒక్క చాన్స్ ఇవ్వండి ..అవినీతిరహిత పాలన అంటే ఏమిటో చూపిస్తా..! జేబులో డబ్బు తీసి ప్రజల కోసం ఖర్చు పెట్టే వాడిని.. అవినీతి చెయ్యను" అంటూ పవన్ చేసిన ప్రసంగం అక్కడి ప్రజలను, ఆయన అభిమానులను ఆకట్టుకోగా..రాజకీయ వర్గాల్లో ఆశక్తికర చర్చను రేపింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏపీలో అత్యంత పాపులర్ అయిన నినాదం "ఒక్క చాన్స్". వైసీపీ ప్లీనరీ నుంచి ప్రశాంత్ కిషోర్ సాక్షిగా జగన్ మోహన్ రెడ్డి అందుకున్న ఈ నినాదం ఏపీలోని మూల మూలకూ చొచ్చుకు పోయింది. 2014 ఎన్నికల్లో ఓటమి పాలైన జగన్ పై సానుభూతిని పెంచడంలో ఈ "ఒక్క చాన్స్" పాత్ర పెద్దదే. అయితే, జగన్ అంటేనే రాజకీయంగా మండిపడే పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆయన వాడిన నినాదాన్ని అందుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది అంటున్నారు ఎనలిస్టులు. మరి 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి వర్క్ ఔట్ అయిన "ఒక్క చాన్స్ " స్లోగన్.. 2024లో పవన్ కు కూడా లక్కును తెచ్చి పెడుతుందా...? చూడాలి...!

## గడపగడపకు ఎమ్మెల్యేల పరుగులు

తిరుపతి, నవంబర్ 15, ఆ ఎమ్మెల్యేల్లో టిక్కెట్ గుబులు నెలకొందట. తిరిగి పోటీ చేసే అభ్యర్థి తామేనా అన్న అనుమానం ఆందోళనగా మారిందట. మళ్లీ సీటు వచ్చే లిస్టులో తామున్నామా లేదా అన్న అనుమానం ఆ జిల్లా ఎమ్మెల్యేల్లో కంగారు పుట్టిస్తోందట. ఆ కంగారుతో గడపగడపకు పరిగెడుతున్నారట. దీనికితోడు వై నాట్ 175? ఆ కంగారును మరింత పెంచుతోందిట.. ఎమ్మెల్యేలంతా గడపగడపకు పరిగెడుతున్నారట. ఎక్కే గడప దిగే గడపతో ఆయాసం నీరసం వచ్చినా ఆగట్లేదుట. తాము జనం మధ్యే ఉన్నామనే సందేశం సీఎం వైఎస్ జగన్‌కు చేరితే తప్ప సిట్టింగ్ సీటు దక్కించుకోలేమని వాళ్లలా పరుగులు తీస్తున్నారట. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారపార్టీ ఎమ్మెల్యేల్లో కొత్త టెన్షన్ నెలకొందిట. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మినహా మిగిలిన ఎవరికీ టికెట్‌పై క్లారిటీ లేని పరిస్థితి ఉందిట. ఇది ఎమ్మెల్యేల్లో గందరగోళానికి కారణం అయ్యిందట. 2024 లో వై నాట్ 175 టార్గెట్ కూడా కలరపెడుతోందంటున్నారు. ఎమ్మెల్యేల పనితీరు, జనం మధ్య వాళు న్నారా లేదా అన్న దానిపై సీఎం జగన్ సర్వేల్లో ఏముందో తెలియని పరిస్థితిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని ఎమ్మెల్యేల్లో ఆందోళన నెలకొందని చెబుతున్నారు. మంత్రుల నుంచి ఎమ్మెల్యేల దాకా సీఎం లిస్టులో తిరిగి తాముంటామా లేదా అన్న కన్ఫ్యూజన్ అందరినీ వెంటాడుతోందట. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముగ్గురు మంత్రులతోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు 10 మందిలో ఒకరిద్దరికి మాత్రం తమ సీటుపై పక్కా క్లారిటీ ఉందట. వాళ్లలో మాత్రం ఎలాంటి గందరగోళం లేదట. మిగతావాళ్లు పైకి ధీమాగానే ఉన్నా బయట జరుగుతున్న ప్రచారం వాళ్లకు ఆందోళన కలిస్తోందటదీంతో గడపగడపకి మన ప్రభుత్వం పేరుతో ఇంటింటికి వెళ్లి ఓటర్లను పార్టీ కేడర్‌ని ప్రసన్నం చేసుకునే పనిలో తిప్పలు పడుతున్నారట అధికార పార్టీ ఎమ్మెల్యేలు. 2024లో కూడా సీటు తమకేనని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారట. గత మూడేళ్లుగా కొంత మంది ఎమ్మెల్యేలు కేడర్‌కి దూరంగా ఉన్నా ఇప్పుడు ఆ గ్యాప్‌ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారట. ఇక తమకు టిక్కెట్ రాదన్న నిర్ణయానికి వచ్చి ఎమ్మెల్యేలు మాత్రం ఎలాంటి టెన్షన్ లేకుండా సొంత పనులు చక్కపెట్టుకుంటూ గడపగడపకు వెళుతూ అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారట.

## కృష్ణ మరణం పట్ల గవర్నర్ సంతాపం

విజయవాడ ప్రముఖ చలన చిత్ర నటుడు, నిర్మాత ఘట్టమనేని శివరామ కృష్ణమూర్తి (కృష్ణ) మరణం పట్ల ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరి చందన్ సంతాపం ప్రకటించారు. నటుడుగా, నిర్మాతగా, దర్శకునిగా, చిత్ర నిర్మాణ సంస్థ అధినేతగా, తెలుగు సినిమా రంగానికి ఐదు దశాబ్దాలపాటు కృష్ణ అందించిన సేవలు మరువలేనివన్నారు. 350 పైగా సినిమాల్లో నటించి, సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన కృష్ణ మృతి తెలుగు చలనచిత్ర రంగానికి తీరని లోటని గవర్నర్ పేర్కొన్నారు. కుటుంబ కథా చిత్రాలతో పాటు, సామాజిక స్పృహ కల్పించే పలు చిత్రాలతో కృష్ణ జనాదరణ పొందారన్నారు. సొంత నిర్మాణ సంస్థ ద్వారా సినీ రంగంలో నూతన ఒరవడులను ప్రవేశ పెట్టిన ఘనత కృష్ణకే దక్కుతుందన్నారు. సూపర్ స్టార్ కుటుంబ సభ్యులకు గవర్నర్ హరి చందన్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## కావలి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు మృతి?పది మందికి గాయాలు

నెల్లూరు నెల్లూరు జిల్లా కావలి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మినీ లారీని లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పది మందికి గాయాలు అయ్యాయి. మృతులు దగ్గు మళ్ళీ యాకోబు,(45), కొండమూరి ఆదాం(45) గా గుర్తించారు. ప్రమాద ఘటన సమయంలో మినీ లారీ లో 20 మంది వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్నారు. వారంతా నాయుడుపేట నుండి బాపట్ల వద్ద చెరుకూరు వెళుతున్నారు. వ్యవసాయ కూలీలు పొలం పనుల కోసం బాపట్ల నుండి నాయుడుపేటకు వచ్చారు. క్షతగాత్రులను కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ఇందిరా గాంధీ ఆశయాలకోసం పని చేసిన వ్యక్తి శైలజానాథ్

విజయవాడ కాంగ్రెస్ నేత, ప్రముఖ చలన చిత్ర నటుడు, సినీ హీరో సూపర్ స్టార్ కృష్ణ మరణం పట్ల ఎపిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ సంతాపం తెలపారు. శైలజనాథ్ మాట్లాడుతూ నటుడుగా, నిర్మాతగా, దర్శకుడిగా, తెలుగు సినిమా రంగానికి ఐదు దశాబ్ధాల పాటు కృష్ణ అందించిన సేవలు మరువరానివి, మరుపురానివన్నారు. 350 కి పైగా సినిమాల్లో నటించి, సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన కృష్ణ మరణం తెలుగు చిత్ర రంగానికి తీరని లోటు. విభిన్న కుటుంబ కథా చిత్రాలతో పాటు ప్రజలకు సామాజిక స్రృహ కల్పించే సాంఘిక చిత్రాల నటుడుగా కృష్ణ జనాదరణ పొందారు. 1989 లో ఏలూరు నుండి కాంగ్రెస్ ఎంపి గా పనిచేసి ప్రజలకు మరిన్ని సేవలందించారు. ఇందిరాగాంధీ ఆశయాలకోసం, రాజీవ్ గాంధీ స్వప్నాల కోసం అహర్నిశలు పనిచేశారు. కాంగ్రెస్ వాదిగా ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను చైతన్యం చేసిన వ్యక్తి సూపర్ స్టార్ . అయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని అన్నారు.

## డేంజర్ గేమ్ ఎవరికి ఎఫెక్ట్...

విజయవాడ, నవంబర్ 15, ఏపీలో బీజేపీకి ఏ మాత్రం బలం లేదనే సంగతి తెలిసిందే?ఒక్క శాతం కూడా ఓట్లు లేవు..ఆ పార్టీకి ఒక్క వర్డ్ మెంబర్ గెలుచుకునే బలం లేదు..కానీ ఏపీ రాజకీయాలని నడిపించేది బీజేపీనే. కేంద్రంలోని పెద్దలు ఏపీ రాజకీయాలని నడిపిస్తున్నారు. వారు ఎవరికి మద్ధతుగా ఉంటే వారిదే రాష్ట్రంలో హవా అన్నట్లు పరిస్తితి ఉంది. ఇక కేంద్రానికి భయపడి ఇటు అధికారంలో ఉన్న జగన్, అటు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు రాజకీయం చేయాల్సి వస్తుంది. పవన్ ఎలాగో బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నారుఅయితే ఇప్పుడు బీజేపీ ఆడిస్తున్న గేమ్ చాలా డేంజరస్‌గా నడుస్తోంది..ఆ పార్టీ ఎవరిని అడ్డుపెట్టుకుని ఎవరికి చెక్ పెడుతుందో అర్ధం కాకుండా ఉంది. గత ఎన్నికల్లో కేంద్రం సపోర్ట్ పూర్తిగా జగన్‌కే ఉందన్న సంగతి తెలిసిందే. చంద్రబాబుకు దెబ్బకొట్టడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదిపి, జగన్‌కు ఫుల్ సపోర్ట్ ఇచ్చింది..వ్యవస్థలు సైతం జగన్‌కు అనుకూలంగా నడిచిన పరిస్తితి కనిపించింది. అసలే బాబుపై వ్యతిరేకత, వైసీపీకి అనుకూల పవనాలు, జనసేన ఓట్లు చీల్చడం, బీజేపీ సపోర్ట్..వెరసి జగన్ సీఎం అయ్యారు.ఇక నెక్స్ట్ ఎన్నికల్లో జగన్‌కు చెక్ పెట్టి అధికారం దక్కించుకోవాలని బాబు చూస్తున్నారు. ఇదే క్రమంలో మొదటగా కలిసొచ్చే పవన్‌ని దగ్గర చేసుకుంటున్నారు. పవన్ సైతం వైసీపీ వ్యతిరేక ఓట్లని చీల్చనివ్వను అని చెప్పి, బాబుకు మద్ధతుగా ఉన్నట్లు కనిపించారు. సరే వీరితో బీజేపీ కలిసొస్తే..కేంద్రం సపోర్ట్ ఉంటుంది..జగన్‌కు చెక్ పెట్టవచ్చని అనుకున్నారు.కానీ ఏపీలో రాజకీయ సమీకరణాలని బీజేపీ మార్చేసింది. పవన్‌తో బాబు భేటీ అయితే, పవన్ ఏమో మోదీని కలిశారు. ఆ తర్వాత జగన్, మోదీని కలిశారు. ఈ పరిణామాల నేపథ్యంలో టిడిపి అనుకూల విశ్లేషకులు ఏం అంటున్నారంటే.. చంద్రబాబు వెళ్లి పవన్‌ని కలిసారు. పవన్ వెళ్లి మోదీని కలిసారు. మళ్ళీ ఆ మోది వచ్చి జగన్‌ని కలిసారు. దీనిని బట్టి అర్ధమయ్యేది ఏమిటంటే జగన్ పాలనకి బీజేపీ మద్దతుంది. ఆ బీజేపీని పవన్ కళ్యాణ్ వదలలేకపోతున్నారు. అలాంటి పవన్‌ని పట్టుకుని బాబు ఏదో మార్పు సాధిస్తామనే భ్రమలో ఉన్నారని అంటున్నారు. అంటే ఎట్టి పరిస్తితుల్లో పైనున్న బీజేపీకి బాబు సపోర్ట్ చేయదని, అంటే బీజేపీ-పవన్ కలిసి పోటీ చేసి ఓట్లు చీల్చి, మళ్ళీ జగన్‌ని గెలిపించడమే లక్ష్యంగా వెళ్తారని చెబుతున్నారు. ఇక చివరికి బలయ్యేది బాబు అని అంటున్నారు.

## 55 మంది టచ్ లో ఉన్నారా

గుంటూరు, నవంబర్15, ఆంధ్రప్రదేశ్లో అధికార వైసీపీ పార్టీకీ రానున్న కొద్ది రోజులలో బిగ్ షాక్ తగలనుందని వార్తలు వినిపిస్తున్నాయి. వైసిపి పార్టీకి చెందిన 55 మందికిపైగా ఎమ్మెల్యేలు బిజెపి పార్టీతో టచ్ లోకీ వెళ్లారన్న కథనంతో అధికార పార్టీలో విస్తృత చర్చ జరుగుతుంది. కొంతమంది ఎమ్మెల్యేలకు సీటు ఇచ్చినప్పటికీ పోటీ చేయడానికి సిద్ధంగా లేరని తెలిసింది. వీరు గత కొంతకాలంగా ఇతర పార్టీ నేతలతో టచ్ లో ఉన్నట్లు సమాచారం.సీఎం జగన్ నిర్ణయాలతో అత్యధిక శాతం మంది ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారని విమర్శ ఎప్పటినుంచో ఉంది. ఆదాయం కూడా లేకపోవడంతో ఎన్నికలలో పెట్టిన ఖర్చులు అయినా తిరిగి తెచ్చుకోవచ్చని బిజెపి ఇచ్చిన బంపర్ ఆఫర్ కు బెండ్ అయ్యారా, లేక ఇదంతా కల్పితమేనా అనే చర్చ జరుగుతుంది. దీనిపై సీఎం జగన్కు కూడా నివేదిక అందినట్లు తెలుస్తోంది. వీరిపై ఇప్పటికే జగన్ గట్టి నిగా పెట్టారని, వీరిలో ఎక్కువగా ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారే ఉన్నారని సమాచారం. మరి జగన్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి

# డిమాండ్ తగ్గట్టు సరఫరా

తిరుపతి, నవంబర్ 15, డిమాండ్ కు తగిన విధంగా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి. విద్యుత్ శాఖ అధికారులుతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ ను అందించే సీఎం విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదు. వ్యవసాయ కనెక్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులను రోజుల తరబడి పెండింగ్ లో పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.దీనికి సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరతాం అన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సీరియస్ గా తీసుకుంటాం. ఎక్కడైనా రైతుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదుల పై కఠినంగా చర్యలు తీసుకుంటాం. రానున్న వేసవిలో డిమాండ్ కు తగిన విధంగా విద్యుత్ సరఫరా జరగాలి. అందుకోసం ట్రాన్స్ కో తో డిస్కంలు సమన్వయం చేసుకోవాలి.రాష్ట్రంలో అవసరమైన ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరు చేసిన 33/11 కెవి స్టేషన్ల నిర్మాణం మూడు నెలల్లో పూర్తి చేయాలి. కొన్నిచోట్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఇండోర్ సబ్ స్టేషన్ ల వల్ల ఎక్కువ వ్యయం అవుతోంది. అర్బన్ ప్రాంతాల్లో తప్పనిసరి అయితే మాత్రమే వాటిని ప్రతిపాదించాలి. రూరల్ ప్రాంతాల్లో ఇండోర్ స్టేషన్ల ను నిర్మించడానికి వీలులేదన్నారు మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి.వ్యవసాయ కనెక్షన్ల పై మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ కనెక్షన్ లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నాం.ఇందుకోసం రైతుల నుంచి ఆధార్ అప్ డేషన్, బ్యాంక్ ఖాతాలను ఓపెన్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి.ఇంకా డిస్కంల పరిధిలో కొన్ని జిల్లాల నుంచి దీనిపై అలసత్వం కనిపిస్తోంది.ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలని అధికారులను కోరారు.

# ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్ రెక్కలు





### అవినీతికి అడ్డాగా మారిన బద్వేలు సబ్ రిజిస్టర్ కార్యాలయం

### ఎకర ప్రభుత్వ భూమి రిజిస్టర్ కావాలంటే 40 లక్షల రూపాయలు పైగా ముడుపులు వసూలు

### ఇప్పటికే నాలుగు సార్లు సబ్ రిజిస్టర్ కార్యాలయ కార్యాలయం పై ఏసీబీ దాడులు



బద్వేలు, బద్వేల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రభుత్వ భూములకు ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ అడ్డు అదుపు లేకుండా పోయింది అడిగేవారు లేకపోవడం కూడా ఇందుకు కారణమైంది ఎకరా ప్రభుత్వ భూమి రిజిస్టర్ చేయాలంటే దాదాపు 40 లక్షల రూపాయలు ముడుపులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి అందుకు తగినట్లుగానే అధికారులు సిబ్బంది వ్యవహారం ఉంది బద్వేలు సబ్ రిజిస్టర్ కార్యాలయం అవినీతికి ఎప్పటినుంచో అడ్డాగా ఉంది కార్యాలయంపై ఇప్పటికే నాలుగు సార్లు ఏసీబీ దాడులు జరిగాయి ఈ దాడుల్లో లక్షలాది రూపాయలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు అయినప్పటికీ అవినీతిలో ఏమాత్రం మార్పు లేకపోవడం విచారకరం బద్వేల్ లో దాదాపు 85 శాతం భూములు ఇంటి స్థలాలు ప్రభుత్వానికి చెందినవి ఇప్పటికీ చాలా భూములు స్థలాలు భూముల బకాసురుల చేతుల్లోకి చేరాయి భూ కబ్జాదారులు గత నాలుగు సంవత్సరాలుగా ఇది చెలరేగిపోతున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే ఇది ఇలా జరుగుతుంటే మరోపక్క ప్రభుత్వ భూములకు రిజిస్ట్రేషన్ రెక్కలు వచ్చాయి అడిగే వారు లేకపోవడంతో లక్షల లక్షలు ముడుపులు తీసుకొని ప్రభుత్వ భూములను రిజిస్టర్ చేస్తున్నారు నిషేధ జాబితాలో ఉన్న భూములకు స్థలాలకు రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు ఆరోపణలు గుప్పు మంటున్నాయి అక్రమంగా సంపాదించడమే ఇక్కడ కనిపిస్తుంది బద్వేల్ పట్టణం బద్వేలు గోపవరం మండలాల పరిధిలో ఉంది ఈ రెండు మండలాల్లో విస్తారంగా ప్రభుత్వ భూములు ఉన్నాయి రిజిస్ట్రేషన్ భూములు చాలా తక్కువ గోపవరం మండలం మడకలవారిపల్లె రెవిన్యూ భూములు ఎక్కువ భాగం బద్వేల్ పట్టణంలో ఉన్నాయి ఈ భూములకు అధికారులు రిజిస్ట్రేషన్ రెక్కలు తొడిగారు పట్టణంలోని మడకలవారిపల్లె రెవెన్యూ సర్వే నెంబర్ 800 ఎకరా ప్రభుత్వ స్థలం ఉంది దానికి 799/2 సర్వే నెంబర్ వేసి ఎకరా ప్రభుత్వ భూమిని రిజిస్టర్ చేసుకున్నారు అలా చేసినందుకు అధికారులకు సిబ్బందికి దాదాపు 40 లక్షల రూపాయలు ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి పట్టణంలోని పట్టణంలోని ఒక ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో సర్వే నెంబర్ 800లో 20 20 సెంట్లు ప్రభుత్వ భూమిని రిజిస్టర్ పేరుతో మడకలవారిపల్లె గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రిజిస్టర్ చేసుకున్నట్లు సమాచారం ఇందుకు అధికారులకు సిబ్బందికి పెద్ద మొత్తంలో ముడుపులు అందించినట్లు తెలిసింది అలాగే ఇదే పొలంలోని 802 సర్వే నెంబర్లో ఎకరా పైగా 800 సర్వే నెంబర్ వేసి రిజిస్టర్ చేయించుకున్నట్లు సమాచారం అలాగే 801 సర్వే నెంబరు లో కొంతవరకు రిజిస్టర్ భూమి ఉంది ఈ సర్వే నెంబరు వేసి పక్కనే ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని రిజిస్టర్ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి బద్వేలులో రిజిస్టర్ స్థలాలకు పక్కనే ప్రభుత్వ భూమి ఉంటే దానిని ఆ రిజిస్టర్ సర్వే నెంబర్ వేసి ఆ భూమిని కూడా రిజిస్టర్ పేరుతో స్వాహా చేస్తున్నారు గోపవరం మండలం మడకలవారి పల్లె రెవిన్యూ పొలంలోని బద్వేల్ పట్టణంలో వెలుగు పాఠశాల ప్రహరీ గోడ ఆనికోని ఉన్న ప్రభుత్వ భూమిని రిజిస్టర్ స్థలంగా మార్చినట్లు సమాచారం డీకేటి స్థలానికి ముందు ఉన్న సర్వే నెంబర్ 805 లో ఉన్న హక్కుదారులకు 36 సెంట్లు ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి దీంతో ఆ స్థలాలకు ఎక్కడలేని గిరాకీ వచ్చింది పట్టణంలో ప్రభుత్వ స్థలం సెంటు రెండు లక్షల రూపాయల పైగా ధర పలుకుతుంది ప్రభుత్వ స్థలాలకు భూములకు రిజిస్ట్రేషన్ రెక్కలు రావడంతో సెంటు 15 నుంచి 20 లక్షల రూపాయలు ధర పలుకుతుంది పట్టణంలో ప్రభుత్వ భూములకు ఇంటి స్థలాలకు దగ్గరలో రిజిస్ట్రేషన్ స్థలాలు భూములు ఉంటే ప్రభుత్వ స్థలాలకు భూములకు రిజిస్ట్రేషన్ సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు 805 సర్వే నెంబర్లో నాలుగున్నర ఎకరాల భూమి ఉంటే వాటి ముందు భాగంలో వెలుగు పాఠశాల అనుకుని ఉన్న ఏడు డీకేటి పట్టాలను వాటికి ఉన్న రోడ్లను మొత్తం రిజిస్ట్రేషన్ గా చేసినట్లు సమాచారం అంతకుముందే ఆ స్థలాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేయడంతో వాటికి ఇప్పుడు ఎక్కడలేని గిరాకి వచ్చింది ప్రభుత్వ స్థలం కూడా రిజిస్ట్రేషన్ కావడంతో మార్కెట్ విలువ పెరిగి వ్యాపారులకు మంచి లాభాలు వచ్చాయి అధికారులకు ముందు ఇచ్చిన ముడుపుల తో పాటు కొత్తగా వచ్చిన లాభాలలో కూడా కొంత ముడుపులుగా ఇచ్చినట్లు తెలిసింది పట్టణంలోని కృష్ణ మందిరం పక్కన ఒకటిన్నర ఎకరా భూమి రిజిస్ట్రేషన్ ఉండగా దాని పక్కనే ఉన్న చెరువు స్థలాన్ని కూడా రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇటీవల ముమ్మరంగా ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం ఈ స్థలాన్ని కూడా రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఆరోపణలు లేకపోలేదు అయినా రెవెన్యూ నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు కనీసం చర్యలు కూడా తీసుకోవడం విచారకరం చెరువు ఆక్రమణలపై ఇప్పటికే ఎప్పటినుంచో ఆరోపణలు ఉన్నాయి చెరువు స్థలాన్ని ఆక్రమించి గత కొన్ని సంవత్సరాలుగా భవనాలు నిర్మించుకున్నారు ఇప్పటికీ కొన్నిచోట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి ఇది కూడా సంబంధిత అధికారులకు స్పష్టంగా తెలుసు పట్టణంలోని నెల్లూరు బైపాస్ రోడ్డు ఒక స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య వాదనలు ఘర్షణలు జరుగుతున్నాయి దాదాపు ఏడు ఎకరాల ఈ స్థల విషయంలో ఎవరికివారు దుమ్మెత్తి పోసుకోవడంతో పాటు ఆ స్థలం మాది అంటే మాది అని వాదనలకు దిగుతున్నారు ప్రభుత్వ స్థలాలకు రిజిస్ట్రేషన్ ముసుగు తొడుగు తొండడంతో ఏది ప్రభుత్వం ఏది రిజిస్టర్ స్థలముతెలియక కొనుగోలుదారులు తల బద్దలు కొట్టుకుంటున్నారు బద్వేల్ పట్టణంలో ఇప్పటికే ప్రభుత్వ భూములు ఆక్రమణలు ఇంటి స్థలాల ఆక్రమాల్లో చాలా కాలంగా జరుగుతున్నాయి ఇటువంటి సమయంలో నకిలీ రిజిస్ట్రేషన్ కూడా వెలుగు చూడడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది ఉన్నతాధికారులు ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ పై చర్యలు తీసుకుంటే అనేక విషయాలు వెలుగు చూడడం ఖాయం

# రైతు కూలీ సంఘం మండల కమిటీ ఏకగ్రీవం

అన్నమయ్య జిల్లా/రాయచోటి (కాంతి పదం) నవంబర్ 15:రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాయచోటి మండల కమిటీని ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు మంగళవారం స్థానిక ఐ ఎఫ్ టి యూ కార్యాలయం లో జరిగిన సమావేశానికి నాలుగు గ్రామాల నుండి రైతు కూలీ లు హాజరయ్యారు దీనికి దార్ల మదన్ మోహన్ అధ్యక్షత వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా . సి పి ఐ ( ఎం ఎల్). న్యూ డెమొక్రసీ అన్నమయ్య జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ హాజరు అయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మండలం లో రైతు కూలీ ల సమస్య ల పై నిరంతరం రాజీలేని పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన రైతు కూలీ ల కు ఒరగపెట్టింది ఏమి లేదన్నారు ప్రతి గ్రామానికి రైతు కూలీ సంఘం నాయకులు వెళ్లి వారి సమస్య ల ను అడిగి తెలుసుకోవాలని, అంతే కాకుండా వారి పక్షాన రాజీలేని పోరాటం కొనసాగించాలని కోరారు వ్యవసాయ మోటార్లు కు మీటర్ల వేయడం అంటే రైతు లకు ఉరితాడు లాంటి దన్నారు

### సమస్య ల పై పోరాటాలు కొనసాగించాలి

### సి పి ఐ (ఎం ఎల్) న్యూ డెమొక్రసీ నేత మావులూరి విశ్వనాథ్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థల అనుకూల వైఖరి ప్రదర్శిస్తున్నాయన్నారు రైతు లకు మాయమాటలు చెప్పడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయన్నారు అనంతరం రైతు కూలీ సంఘం రాయచోటి మండల కమిటీ ని ఏకేగ్రీంగాఎన్ను కోవడం జరిగింది అన్నారు రైతు కూలీ సంఘం రాయచోటి మండల అధ్యక్షులు గా పి పెద్ది నాయుడు మండల ప్రధాన కార్యదర్శి గా పూసపాటి రమణ సహాయ కార్యదర్శి గా యం చలపతి ఉపాధ్యక్షులు గా అశ్విని. సభ్యులు గా సుభద్ర రాజశేఖర్ రమణ శ్రీను మొత్తం 11 మంది తో కమిటీ ని ఎన్నుకోవడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం గాలివీడు మండల కార్యదర్శి యం రఘు నాద్ నాయుడు తది తర్లు పాల్గొన్నారు

## సూపర్ స్టార్ కృష్ణ మృతి బాధాకరం

### కళామతల్లి తన ముద్దు బిడ్డను కోల్పోయింది

### కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి సూపర్ స్టార్ కృష్ణ మృతి బాధాకరం.నేడు కళామతల్లి తన ముద్దు బిడ్డను కోల్పోయిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నటుడు, నిర్మాత, దర్శకుడు, నిర్మాణ సంస్థ అధినేతగా తెలుగు సినిమా రంగానికి ఐదు దశాబ్దాల పాటు సినీ రంగంలో తనదైన ముద్ర వేశారు. కృష్ణ మరణం తెలుగు సినీ రంగానికి తీరని లోటు. ఆయన కుటుంబం సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్దిస్తున్నానని అయన అన్నారు.

## కృష్ణ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి

### జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్



హైదరాబాద్ చిత్రసీమలో సూపర్ స్టార్ బిరుదుకి సార్ధకత చేకూర్చిన కృష్ణ గారు తుది శ్వాస విడిచారనే విషయం ఎంతో ఆవేదన కలిగించింది. కృష్ణ గారు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారని తెలిశాక కోలుకొంటారని ఆశించాను. ఇప్పుడు ఈ విషాద వార్త వినాల్సి వచ్చింది. శ్రీ కృష్ణ గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్ధిస్తున్నాను. స్నేహశీలి, మృదుస్వభావి అయిన కృష్ణ గారు ప్రతి ఒక్కరితో ఎంతో ఆప్యాయంగా ఉండేవారు. మద్రాస్ లో ఉన్నప్పటి నుంచి మా కుటుంబంతో చక్కటి అనుబంధం ఉంది. తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కథానాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, స్టూడియో అధినేతగా కృష్ణ గారు చేసిన సేవలు చిరస్మరణీయాలు. తెలుగు సినిమా పురోగమన ప్రస్థానంలో ఆయన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. విభిన్న పాత్రలు పోషించిన కృష్ణ గారు కౌబోయ్, జేమ్స్ బాండ్ కథలతో తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించారు. పార్లమెంట్ సభ్యుడిగా ప్రజా జీవితంలో కూడా ఆయన తన ముద్ర వేశారు. సినిమా రంగం క్షేమాన్ని కాంక్షించే శ్రీ కృష్ణ గారి మరణం తెలుగు చలనచిత్ర సీమకు తీరని లోటు. ఆయన కుమారుడు మహేష్ బాబు కి, ఇతర కుటుంబ సభ్యులకు నా తరపున, జనసేన పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను

## కళామతల్లి ముద్దుబిడ్డ ఘట్టమనేని కృష్ణ

### నందమూరి బాలకృష్ణ సంతాపం



నటనలో కిరీటి, సాహసానికే మారుపేరు, సాంకేతికతలో అసాధ్యుడు, స్వయంకృషితో ఎదిగిన సూపర్ స్టార్, అపర దానకర్ణుడు.. ఘట్టమనేని కృష్ణ. తెలుగులో కౌబాయ్ సినిమాలకు ఆద్యుడు, గూఢచారి( సీక్రెట్ ఏజెంట్ ) సినిమాల్లో ఘనాపాఠి. సాంఘిక, జానపద, పౌరాణిక, చారిత్రక పాత్రల్లో ఘనాపాఠి.

వర్ధమాన నటులకు, కళాకారులకు ఆదర్శప్రాయుడు కృష్ణ. ఆయనలేని లోటు తీర్చలేనిది. సూపర్ స్టార్ కృష్ణ మృతితో తెలుగు సినీ పరిశ్రమ పెద్దదిక్కును కోల్పోయింది.

ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్ధిస్తున్నాను. కృష్ణ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానని హిందూపూర్ శాసనసభ్యుడు

నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు.

## సూపర్ స్టార్ కృష్ణ మరణం సినీరంగానికి తీరని లోటు

### మండలి బుద్ధప్రసాద్

మచిలీపట్నం సూపర్ స్టార్ కృష్ణ మరణం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటు. సాహసానికి ప్రతీకగా నిలిచి, తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. మా నాన్న మండలి వెంకట కృష్ణారావు కి కృష్ణ అత్యంత సన్నిహితులు. 1975 లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలకు నిధులు సేకరించడంలో కృష్ణ ప్రముఖపాత్ర వహించారు. 1977 మే లో అవనిగడ్డలో జరిగిన రాష్ట్ర నాటకోత్సవాలకు తన సతీమణి విజయనిర్మలతో కలిసి వచ్చారు. ఆ రోజు మా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించారు. 1977 నవంబర్ 19 న దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు 10 వేల రూపాయలు విరాళం ప్రకటించడమే కాకుండా, లక్ష రూపాయలు విలువచేసే నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఒక సంవత్సరం పాటు తనకు వచ్చే ఆదాయంలో 10 శాతం తుఫాను బాధితులకు అందచేసిన దయార్ధ్రహృదయులు. కృష్ణ చేత మంగళగిరి లో స్టూడియో నిర్మాణం చేయించాలని మా నాన్న స్వయంగా వెళ్లి స్థలాన్ని ఎంపిక చేసారు. దురదృష్టవశాత్తు అది ఏ కారణం వల్లనో కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత హైదరాబాద్ లో పద్మాలయా స్టూడియో నిర్మించారు. "హీరో" అనేది ఆయనకు ఇంటి పేరయింది. సినిమా రంగంలోనే కాక, నిజ జీవితంలో కూడా "హీరో" అని అనిపించుకున్న కృష్ణ మరణం తీరని లోటు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్ధిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసుకుంటున్నానని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు.

# నకిలీ అగ్రిమెంట్ల కేంద్రంగా బద్వేలు



## ఫోర్జరీ సంతకాలతో హక్కుదారునికి తెలియకుండానే ఇంటి స్థలాల అమ్మకాలు
## పాత తేదీలతో అగ్రిమెంట్ల తయారీఅగ్రిమెంట్ల తయారీలో పలు గ్యాంగులుగ్యాంగుల్లో కొందరు మహిళలు



బద్వేలు , నకిలీ ఇంటి పట్టాలకు కేంద్రమైన బద్వేలు ఇప్పుడు నకిలీ అగ్రిమెంట్లకు కూడా కేంద్రంగా మారింది ఇంటి పట్టా కలిగిన హక్కుదారునికి ఏ మాత్రం సంబంధం లేకుండానే నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి స్థలాలు తమకే అమ్మినట్లు తయారు చేస్తున్నారు ఇందుకు కొన్ని ప్రత్యేకమైన గ్యాంగులు ఉన్నాయి బద్వేల్ లో పదిమంది కలిసి ఒక గ్యాంగ్ గోపవరం మండలంలో మూడు గ్యాంగులు బి కోడూరు మండలంలో నాలుగు గ్యాంగులు అట్లూరు మండలంలో మరో నాలుగు గ్యాంగులు ఉన్నాయి ఇందులో కొందరు మహిళలు కూడా ఉన్నారు ఫోర్జరీ సంతకాలు చేయడంలో వీరుగానపాటీలు అని చెప్పాలి ఎవరి సంతకమైనా ఈ అధికార సంతకమైన ఏమాత్రం అనుమానం రాకుండా చేసేస్తారు ఇటువంటి మహిళలపై ఇప్పటికే పోలీస్ కేసు నమోదయింది తాసిల్దార్ జిల్లా కలెక్టర్ తో పాటు ప్రైవేట్ వ్యక్తుల సంతకాలు కూడా ఏమాత్రం తీసుకోకుండా అచ్చు గుద్దినట్లు చేసేస్తారు వీరు అంతా ఆరితేరిపోయారని చెప్పాలి చెప్పాలి విలువైన ఇంటి స్థలాలపై వీరికి ఎప్పటినుంచో కన్ను ఉంది మీరు వద్ద ఉన్న పాత అగ్రిమెంట్ల ద్వారా స్థలం హక్కుదారుని సంతకం అచ్చుకుద్దినట్లు చేసి తమకు స్థలం హ క్కుదారుడు విక్రయించినట్లు అగ్రిమెంట్లు తయారు చేస్తారు ఈ విషయం స్థలం కలిగిన అక్కుదారునికి ఏ మాత్రం తెలియదు వీరి వద్ద పాత అగ్రిమెంట్లు ఎన్నో ఉన్నాయి ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే పాత తేదీలతో అగ్రిమెంట్లు తయారుచేసి ఇతరులకు లక్షలకు లక్షలకు విక్రయిస్తారు పాత అగ్రిమెంట్లు అసలైనవే నకిలీవ తెలుసుకోవడం అత్యంత కష్టం స్థలం గల హక్కుదారుడు సంతకం కూడా అచ్చు గుద్దినట్లు ఉ ంటుంది హక్కుదారుని ఇంటి వివరాలు అన్ని ముందుగానే తెలుసుకొని ఆ తరువాత రంగంలోకి దిగి ఎవరు కనుక్కోని విధంగా అగ్రిమెంట్లు తయారుచేస్తారు ఇవి బద్వేల్ లో ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నాయి బద్వేలు పట్టణం సిద్ధవటం రోడ్డులో పూర్వపు చెన్నంపల్లి పంచాయతీ 1790/3 సర్వే నెంబర్లో హ క్కుదారునికి సంబంధం లేకుండానే ఇంటి స్థలంపై నకిలీ అగ్రిమెంట్ సృష్టించి ఇతరులకు విక్రయించారు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కంప సముద్రం గ్రామాన్ని చెందిన ఒక మహిళ బద్వేల్ లో కొంతమంది దళారులను పట్టుకుని వారి ద్వారా స్థలం అమ్మకం చేసినట్లు సమాచారం బ్రోకర్లు తమ బ్రోకరేజ్ చూస్తున్నారు తప్ప అసలు హక్కుదారుడు స్థలాన్ని విక్రయించాడా అగ్రిమెంట్ అసలుదా? నకిలీదా? స్థలం హక్కుదారుడు స్థలాన్ని విక్రయించాడా? అనే విషయాలు ఏమాత్రం పట్టించుకోకుండా స్థల విక్రయాలు జరిగిపోతున్నాయి ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు హక్కుదారుడు అనుభవించాల తప్ప ఇతరులకు విక్రయించకూడదని బద్వేల్ ఆర్ డి ఓ ఆకుల వెంకటరమణ పదేపదే చెబుతూ వస్తున్నారు వంద రూపాయల బాండ్ పేపర్ పై స్థల విక్రయాలు జరిగినా అవి ఏమాత్రం చెల్లవని అవి చిత్తు కాగితంతో సమానమని ఆర్డిఓ ఇప్పటికే పలుమార్లు చెప్పడం జరిగింది హక్కుదారునికి ఏమాత్రం సంబంధంలేని నకిలీ అగ్రిమెంట్లు ఇప్పుడు బద్వేల్ను కుదిపేస్తున్నాయి ఇప్పటికే నకిలీ ఇంటి పట్టాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు ఇలాంటి పరిస్థితుల్లో నకిలీ అగ్రిమెంట్లు బయటపడడం అందరిని కలవరపాటుకు గురిచేస్తుంది హక్కుదారులు సంతకాలు అచ్చు గుద్దినట్లుగా ఉండడం హక్కు దారునికి ఆశ్చర్యం కలిగిస్తుంది హక్కు దారుని వద్ద అన్ని పత్రాలు ఉన్నప్పటికీ నకిలీలే రాజ్యమేలుతున్నాయి నకిలీ పట్టాల తయారీ విషయంలో బద్వేల్ పోలీసులు ఇప్పటికే 20 మంది పైగా కేసులు నమోదు చేసి వారిలో కొందరిని అరెస్ట్ చేశారు ఇలాంటి పరిస్థితుల్లో నకిలీ అగ్రిమెంట్ల వెలుగులోకి రావడంతో నష్టపోతున్న అసలు హక్కుదారులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆలోచనలో ఉన్నారు నకిలీ అగ్రిమెంట్లపై కూడా ఇప్పటికే పోలీసులు రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం నకిలీ అగ్రిమెంట్ల తయారీలో మహిళలు కూడా ఉండడం అధికారులకు ఆశ్చర్యం కలిగిస్తుంది వీరికి పాత అగ్రిమెంట్ పత్రాలు ఎలా వస్తున్నాయి ఎవరు వస్తున్నారు అనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు నకిలీ పట్టాలు తయారు చేయడంలో వీరు ఆరితేరిపోయినట్లు సమాచారం నకిలీ ఇంటి పట్టాలు హక్కుదారునికి ఏ మాత్రం సంబంధం లేని నకిలీ సంతకాలతోకూడినఅగ్రిమెంట్లుపైకూడా అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం అధికారులు రంగంలోకి దిగితే చాలా విషయాలు వెలుగులోకి వస్తాయి హక్కుదారునికి అధికారులు తీసుకునే చర్యలు వల్ల న్యాయం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది యుద్ధ ప్రాతిపదిక పై అధికారులకు అధికారులు చర్యలు తీసుకొని హక్కుదారులకు న్యాయం చేయవలసిన బాధ్యత ఉంది అధికారులు చర్యలు తీసుకోవడం మొదలు పెడితే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి

# కేజీబీవీ నందు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి





## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డ్వామా పిడి.

తుగ్గలి : మండల పరిధిలోని గల కస్తూరిబా పాఠశాల యందు మధ్యాహ్న భోజన పథకాన్ని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి మంగళవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ఆధారంగా మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆయన అధికారులకు తెలియజేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను తప్పకుండా పాటించాలని ఆయన తెలియజేశారు. వంటగది యందు, భోజనశాల యందు పరిశుభ్రతను పాటించాలని ఆయన తెలియజేశారు. మధ్యాహ్న భోజనం పథకం పట్ల విద్యార్థుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమా వెంకటేశ్వర్లు, వెలుగు ఏపిఎం రాధాకృష్ణ, ఏపీవో రామకృష్ణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, బోధనా సిబ్బంది మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సినీ పరిశ్రమ ఓ దిగ్గజాన్ని కోల్పోయింది..

నందికొట్కూరు నవంబర్ 15తెలుగు సినీ పరిశ్రమ ఓ దిగ్గజాన్ని కోల్పోయిందని నందికొట్కూర్ కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామ టాకీస్ యజమాని రామ్ రెడ్డి తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ మృతి పట్ల శ్రీరామ టాకీస్ యజమాని రాంరెడ్డి సంతాపం తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ అంటేనే.. మంచితనానికి, మానవత్వానికి నిలువుటద్దం. గుంటూరు జిల్లా తెనాలి మండలములోని బుర్రిపాలెంలో 1942 మే 31న ఘట్టమనేని వీర రాఘవయ్య చౌదరి - నాగరత్నమ్మలకు పెద్ద కొడుకుగా జన్మించిన ఘట్టమనేని కృష్ణ సూపర్ స్టార్ గా మారడానికి చేసిన కృషి అంతా ఇంతా కాదు. నటుడు, దర్శకుడు, నిర్మాత, స్టూడియో అధినేతగా తెలుగు సినీ కళామతల్లికి ఆయన అందించిన సేవలు మరపురానివి. కృష్ణ పూర్తిపేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. నందికొట్కూరు కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామ్ టాకీస్ యజమాని రామ్ రెడ్డి అన్నారు మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని శీరామ టాకీస్ లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం సినిమా హాలు ఈరోజు అంతా బంద్ చేయడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కృష్ణ 1970-80ల్లో తెలుగు సినిమా హీరోగా విశేష ప్రజాదరణ పొంది సూపర్ స్టార్‌గా ప్రఖ్యాతిగాంచారు. 1964కంటే ముందు పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన కృష్ణకు 1964-65లో 'తేనెమనసులు' ద్వారా హీరోగా నటించే అవకాశం వచ్చింది. ఆ తర్వాత వచ్చిన 'గూఢచారి 116' పరిశ్రమలో నిలదొక్కుకునేందుకు దోహదపడింది. ఆ పైన నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌లో 340 పైచిలుకు సినిమాల్లో నటించారు. 1970లో నిర్మాణ సంస్థను ప్రారంభించి పద్మాలయా సంస్థ ద్వారా పలు విజయవంతమైన చలన చిత్రాలు తీశారు. 1983లో ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్‌లో స్వంత స్టూడియో పద్మాలయాను స్థాపించారు. కృష్ణ దర్శకుడిగానూ 16 సినిమాలు తీయడం గమనార్హం! ఆయన ఆత్మకు మనశాంతి చేకూరాలని నియోజకవర్గ ప్రజల తరఫున తెలుపుతున్నామని అన్నారు



# ధమాకాతో వస్తోన్న రవితేజ




సూపర్ స్పీడ్‌తో వరుస సినిమాలు చేస్తున్నాడు రవితేజ. ప్రస్తుతం నాలుగు చిత్రాల్లో అతను నటిస్తుండగా, వాటిలో ముందుగా రాబోతున్న సినిమా 'ధమాకా'. నక్కిన త్రినాథరావు దర్శకుడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. జయరామ్, సచిన్ ఖేడ్కర్, తనికెళ్ల భరణి, రావు రమేష్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే టీజర్‌తో పాటు 'జింతాక్' అనే పాటను విడుదల చేసిన టీమ్, శుక్రవారం మరో పాటను రిలీజ్ చేసింది. 'వాట్స్ హ్యాపెనింగ్ ఇన్ మై దిల్‌లో.. వాట్స్ హ్యాపెనింగ్ ఆన్ మై వేలో' అంటూ సాగే ఈ పాటను భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేయగా రమ్య బెహ్రా, భార్గవి పిల్లై పాడారు. రామజోగయ్య శాస్త్రి రాశారు. 'పది గంటలకే పడుకునేదాన్ని, వీడు వచ్చాకేమో రెండవుతోందే.. గది గడపలనే దాటనిదాన్ని తిరిగొచ్చే టైమ్ ఏమో ఏడవుతోందే .. బుజ్జి అంటూ, కన్నా అంటూ, వాడంటుంటే పడిచస్తున్నా' అని ప్రేమలో పడ్డ కొత్తలో హీరోయిన్, హీరో గురించి పాడుకుంటున్నట్టుగా ఉంది. 'డబుల్ ఇంపాక్ట్' క్యాప్షన్‌తో తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కి ప్రసన్న కుమార్ బెజవాడ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు రాస్తున్నాడు. టీజీ విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ కలిసి నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. డిసెంబర్ 23న విడుదల కానుంది

# సమంతతో మరోమారు జోడీ కట్టనున్న నాగచైతన్య



సమంత-నాగచైతన్య విడాకుల ప్రకటన కేవలం దక్షిణాదినే కాదు ఉత్తరాదిన కూడా గతేడాది హాట్ టాపిక్ అయింది. ఎన్నో ఏళ్ళుగా ప్రేమలో ఉన్న ఈ జంట వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నాలుగేళ్లకే విడిపోవడంతో.. అటు ప్రేక్షకులు, ఇటు సినీ సెలబ్రిటీలు ఒక్కసారిగా షాక్‌కు గురైయ్యారు. మనస్పర్థల కారణంగా వీరిద్దరూ తమ వైవాహిక జీవితానికి స్వస్తి చెప్పారు. విడిపోయిన తర్వాత కూడా వీరిద్దరూ స్నేహితులుగానే ఉంటున్నారట. ఇక ఇటీవలే సమంత మయోసైటిస్ అనే వ్యాధి బారిన పడిన విషయం తెలిసిందే. అయితే త్వరలోనే నాగార్జున, నాగచైతన్య.. సమంతను కలువబోతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే విడాకుల తర్వాత సమంత, నాగచైతన్య కలిసి నటించనున్నట్లు టాక్. 'ఏమాయ చేశావే' సినిమాతో వీరిద్దరూ మొదటి సారి కలిసి నటించారు. ఈ చిత్రం తర్వాత 'మనం', 'ఆటోనగర్ సూర్య', 'మజిలీ' వంటి చిత్రాల్లో నటించారు. అయితే తాజాగా వీరిద్దరూ కలిసి ఓ బిగ్ ప్రాజెక్ట్‌లో నటించనున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే విడాకుల తర్వాత వీరిద్ధరూ కలిసి నటించిన తొలి సినిమా ఇదే అవుతుంది. ఇందులో నిజమెంతుందో తెలియదు కానీ ఈ వార్తతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. వివాహ బంధానికి స్వస్తి చెప్పిన వీరిద్దరూ ప్రొఫెషనల్ పరంగా కలిసి నటించడానికి సిద్ధంగా ఉంటామని ఎన్నో సందర్భాల్లో చెప్పారు. ఇక వీరిద్దరూ మళ్ళీ కలిసిపోవాలని ఎంతో మంది కోరుకుంటున్నారు. విడాకుల తర్వాత సమంత, నాగచైతన్య వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా గుడుపుతున్నారు. ప్రస్తుతం నాగచైతన్య, వెంకట్‌ప్రభు దర్శకత్వంలో 'ఎన్‌సి22' చేస్తున్నాడు. ఇక సమంత ఇటీవలే 'యశోద'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. శుక్రవారం రిలీజైన ఈ చిత్రం పాజిటీవ్ రివ్యూలను తెచ్చుకుని భారీ వసూళ్లు సాధిస్తుంది. హరి-హరీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సరోగసి కాన్సెప్ట్‌తో తెరకెక్కింది. దీనితో పాటుగా గుణశేఖర్ 'శాకుంతలం'లో నటిస్తుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈచిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఇక విజయ్ దేవరకొండతో కలిసి 'ఖుషీ' చిత్రాన్ని కూడా చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# పాయల్ రాజ్‌పూత్..మాయపేటిక

గ్లామర్ రోల్స్‌తో ఆకట్టుకునే పాయల్ రాజ్‌పుత్.. త్వరలో ఓ కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆమె లీడ్ రోల్‌లో రమేష్ రాపార్తి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మాయా పేటిక'. విరాజ్, రజత్ రాఘవ, సిమ్రత్ కౌర్, హిమజ, శ్రీనివాస రెడ్డి ఇతర పాత్రలు పోషిస్తున్నారు. మాగుంట శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మి రెడ్డి నిర్మాతలు. ఇటీవల ఈ మూవీ ఫస్ట్ లుక్, టీజర్‌ను లాంచ్ చేశారు. 'సెల్‌ఫోన్ వచ్చాక మనుషులు మారిపోయారు. ఏం చేసినా, చూసినా, దాచినా, దోచినా అన్ని ఫోన్‌లోనే. అలాంటి ఫోన్‌కే ఒక కథ ఉంటే..' అంటూ రానా వాయిస్ ఓవర్‌తో వచ్చిన టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పాయల్ మాట్లాడుతూ 'ఎంతో రీసెర్చ్ చేసి ఈ మూవీ తీశారు. ఇలాంటి క్యారెక్టర్స్ కూడా అరుదుగా వస్తుంటాయి. డైరెక్టర్ రమేష్ గారితో మళ్లీ పని చేయాలని ఉంది. ఆయన నుంచి ఎంతో నేర్చుకోవచ్చు' అని చెప్పింది. 'సెల్ ఫోన్ ఆధారంగా ఈ స్క్రిప్ట్ రూపొందించాం. మీ సెల్ ఫోన్‌లో ఏయే ఫీచర్లు ఉన్నాయో అలాంటి ఫుల్ ప్యాకేజీ సినిమా ఇది' అని చెప్పాడు దర్శకుడు. 'థ్యాంక్ యూ బ్రదర్' మూవీ తర్వాత ప్రేక్షకులిచ్చిన ధైర్యంతోనే ఈ రెండో సినిమా 'మాయా పేటిక'ను నిర్మించాను అన్నారు నిర్మాత శరత్. అనసూయ, సునీల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# నాన్‌స్ట్రైకర్ రనౌట్.. ఉమ్రాన్ మాలిక్ టాలెంట్‌పై కేన్ కీలక వ్యాఖ్యలు




నవంబర్ 18 నుంచి భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే హార్దిక్ పాండ్య నాయకత్వంలోని స్క్వాడ్‌ను భారత్ ప్రకటించగా.. తాజాగా కివీస్ కూడా తన జట్టు సభ్యులను వెల్లడించింది. భారత్‌తో సిరీస్ సందర్భంగా న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఓ ఆంగ్ల ఛానల్‌తో ప్రత్యేకంగా మాట్లాడాడు. టీమ్‌ఇండియా ఆటగాడు ఉమ్రాన్ మాలిక్ జట్టులోకి రావడం, టీ20 ప్రపంచకప్ ముగిసిన వెంటనే భారత్‌తో సిరీస్‌లు, నాన్‌స్ట్రైకర్ రనౌట్.. కొన్ని విషయాల మీద తన స్పందన తెలిపాడు. నవంబర్ 18న తొలి టీ20 మ్యాచ్ జరగనుంది."ఇలాంటి విషయాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం లేదు. ఇప్పటికే చాలా మంది మాట్లాడేశారు. అయితే వ్యక్తిగతంగా మాత్రం ఆటకు ఇదేమంత ఆకర్షణీయంగా ఉంటుందని అనుకోవడం లేదు. పోటీ పడేటప్పుడు ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉంటారు. అలాగని కాస్త ముందుగా క్రీజ్‌ను వదిలి ప్రయోజనం పొందాలని చూస్తారని భావించడం లేదు. అభిమానులు ఎక్కువగా బ్యాట్, బంతికి మధ్య పోరును చూడటానికే ఇష్టపడతారు"టీ20 ప్రపంచకప్‌లో ఓ మ్యాచ్ సందర్భంగా గ్లెన్ ఫిలిప్ నాన్‌స్ట్రైకింగ్‌లో ఉండి స్ప్రింటర్ మాదిరిగా పరిగెత్తేందుకు సిద్ధంగా ఉన్న వీడియో వైరల్‌గా మారింది. దానిపై కేన్ స్పందిస్తూ.. "ఆ సంఘటన గురించి నేను మాట్లాడకూడదు. ఎందుకంటే అక్కడ ఉంది గ్లెన్ ఫిలిప్. అతడు క్రీజ్‌లో చాలా వేగంగా ఉంటాడు. అందుకే స్ప్రింటర్‌లా పరుగు కోసం ప్రయత్నిస్తే అదనంగా ప్రయోజనం ఉండొచ్చని అతడు భావించి ఉంటాడు. క్రీజ్‌లో చివరికి ఉండి తన బ్యాట్‌ను గీతకు ఇవతల ఉంచి పరుగు కోసం సిద్ధంగా ఉన్నాడు. ఇలాంటి డిఫరెంట్ థియరీలు కొన్ని ఉన్నాయి'"దాదాపు 150 కి.మీ వేగంతో బంతులను సంధించే ఉమ్రాన్ మాలిక్ చాలా టాలెంటెడ్. ప్రపంచ క్రికెట్‌లో ఇలా తక్కువ మంది మాత్రమే ఉంటారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని.. నేర్చుకుంటూ మరింత ఎదగాలి. భారత టీ20 లీగ్‌లో అదరగొట్టాడు. ఆ అనుభవం కచ్చితంగా అతడికి దోహదం చేస్తుంది" అని కేన్ విలియమ్సన్ వెల్లడించాడు. టీ20 లీగ్‌లో హైదరాబాద్ ఫ్రాంచైజీకి కేన్ విలియమ్సన్ కెప్టెన్ అని తెలిసిందే. ఈ జట్టులోనే ఉమ్రాన్ మాలిక్ కీలక బౌలర్‌గా మారాడు.కేన్ విలియమ్సన్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైకెల్ బ్రాస్‌వెల్, దేవన్ కాన్వే, లాకీ ఫెర్గూసన్, మ్యాచ్ హెన్రీ, టామ్ లాథమ్, డారిల్ మిచెల్, ఆడమ్ మిల్నే, గ్లెన్ ఫిలిప్స్, జిమ్మీ నీషమ్, మిచెల్ సాంట్నర్, టిమ్ సౌథీ, బ్లెయిర్ టిక్నర్

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**